పత్తాలేని ఈ పాలన!

గ్రామాల్లో సాంకేతిక వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చేసే ప్రయత్నాలు ఆశించిన మేర విజయం సాధించడం లేదు. అవినీతి నిర్మూలన, పాలనలో పారదర్శకత, వేగానికి కంప్యూటరీకరణ ఎంతో అవసరం. కానీ చాలా గ్రామాల్లో సాంకేతిక పరికరాలు, సరైన సిబ్బంది లేక లక్ష్యం నీరుగారుతోంది.

గ్రామ పంచాయతీల్లో కనిపించని కంప్యూటరీకరణ

- ఇంటర్నెట్ సౌకర్యం, ఆపరేటర్లు లేక ఇబ్బందులు
- మూలన పడ్డ కంప్యూటర్లు, సామగ్రి



మండల పరిషత్ కార్యాలయం


గ్రామ పంచాయతీలో వృథాగా పడిఉన్న కంప్యూటర్, యూపీసీ

కేశంపేట: గ్రామ పంచాయతీలు అందించే సేవల్లో పారదర్శకత కోసమని 2015లో అప్పటి ప్రభుత్వం ఈ- పంచాయతీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. మండలంలో 18 ఉమ్మడి జీపీలు ఉండగా వాటిలో పన్నెండింటికీ కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌లు అందజేశారు. కానీ ఆపరేటర్లను ఇవ్వకపోవడంతో ఈ- పాలన ప్రారంభమై తొమ్మిదేళ్లు దాటినా కంప్యూటర్లు నిరుపయోగంగా ఉన్నాయి. పాలనా సౌలభ్యం కోసం గత ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసింది. వీటిని కలుపుకొంటే మండలంలో 29 జీపీలున్నాయి. వీటిలో చాలా గ్రామాల్లో పంచాయతీలకు పక్కా భవనాలు, మౌలిక వసతులు లేవు. కొన్ని చోట్ల కార్యదర్శి కూర్చోడానికే స్థలం లేని పరిస్థితి ఉంది. ఈ దశలో కంప్యూటర్లను ఏర్పాటు చేసుకోవడం ప్రశ్నార్థకంగా మారింది.

ఇంటర్నెట్ లేక మూలకు

మారుమూల ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో కంప్యూటర్లను మూలన పడేశారు. ఆపరేటర్లు సైతం లేకపోవడంతో ప్రజలు మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న సిబ్బందితోనే సేవలు పొందుతున్నారు. ఈ-పాలన ద్వారా జనన, మరణ నమోదు ధ్రువీకరణ పత్రాలు, హరితహారం వివరాలు, గ్రామ పంచాయతీ డిమాండ్, కలెక్షన్‌ల నివేదికను ఎప్పటికప్పుడు నమోదు చేయడం, ఇంటి పన్నుల వసూళ్లు, ఆసరా పింఛన్ దరఖాస్తుదారుల వివరాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల వివరాలు, అభివృద్ధి నిర్మాణ దశల నమోదు, ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న గృహాలు, గ్రామ కంఠం భూమి తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

12 పంచాయతీలకు అందజేత

మండలం పరిధిలో 12 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం కంప్యూటర్, యూపీఎస్, ప్రింటర్లు అందించింది. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, వేములనర్వ, కొండారెడ్డిపల్లి, కేశంపేట, లేమామిడి, నిర్దవెళ్లి, సంగెం, కొత్తపేట, సంతపూర్, అల్వాల, తొమ్మిదిరేకుల గ్రామాలకు ఇచ్చారు. వీటిలో చాలా గ్రామాల్లో కంప్యూటర్లు వినియోగంలో లేకపోవడంతో వాటిని చెత్తబుట్టలో పడేశారు.

ఈ సేవలు అందించాలి



గ్రామాల్లోనే ప్రజలకు ఈ సేవలను అందించాలి. ఉమ్మడి గ్రామాల వారీగా కాకుండా అన్ని గ్రామ పంచాయతీల్లో కంప్యూటర్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ఆపరేటర్‌ను ప్రభుత్వం నియమించాలి. ప్రజలకు అందుబాటులో ఈ సేవలు అందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నేరవేరుతుంది.

– చిర్ర శ్రీను, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు, కేశంపేట

మరమ్మతులు చేయించాం



ప్రభుత్వం ఇచ్చిన కంప్యూటర్లు కొన్ని గ్రామాల్లో రిపేర్లకు వచ్చాయి. వాటిని బాగు చేయించాం. మరికొన్ని గ్రామాల్లో పాడైన వాటిని వినియోగించడం లేదు. కొన్ని జీపీలకు దాతలు కంప్యూటర్లను అందించారు. మండల కేంద్రంలోని ఆపరేటర్లతో ప్రస్తుతం పనులు చేయిస్తున్నాం.

– రవిచంద్రకుమార్‌రెడ్డి,ఇన్‌చార్జి ఎంపీడీఓ,కేశంపేట


ఆటోలో ప్రమాదకరంగా నిల్చున్న మహిళ

పట్టు జారిందా.. అంతే!

పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణించొద్దని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అందుకు ఆచరణ కరువైంది. ఓ ఆటోలో పదిహేను మందికిపైగా మహిళ కూలీలు ప్రయాణించడమే కాకుండా అందులో ఒకరు ప్రమాదకరస్థితిలో నిలబడి గమ్య స్థానానికి చేరుతున్నారు. ఇదీ కడ్తాల్ మండల పరిధిలోని రావిచేడ్ గ్రామం నుంచి కేశంపేట మండల పరిధిలోని పాటిగడ్డకు వెళ్తున్న ఓ ఆటోలో శుక్రవారం కనిపించిన దృశ్యాలు. సదరు మహిళ పట్టుజారితే ఊహించని నష్టం జరుగుతుందని స్థానికులు భావిస్తున్నారు.

– కేశంపేట

గౌడ కుల హక్కుల సాధనకు కృషి


అంజయ్యగౌడ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న మల్లేష్‌గౌడ్

మొయినాబాద్‌రూరల్: గౌడ కుల హక్కుల సాధన కోసం రాష్ట్రంలోని తమ కులస్తులందరినీ ఏకం చేసుకుందామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేనుట్ల మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం రాత్రి నగరంలో జరిగిన గౌడ కుల హక్కుల సాధన సమావేశంలో మొయినాబాద్ మండల గౌడ కుల అధ్యక్షుడిగా నక్కలపల్లి అంజయ్యను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి గౌడ కుల సభ్యులందరినీ ఏకం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు లక్ష్మీశైలజ, నాయకులు బందయ్యగౌడ్, మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి

ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి


బంగారం షాపును పరిశీలిస్తున్న సీఐ

మొయినాబాద్: బంగారం షాపులను టార్గెట్‌గా చేసుకుని దొంగలు దోపిడీలకు పాల్పడుతున్నారని, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని పలు బంగారం షాపులను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాపుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. షాపుల వద్ద వాచ్‌మెన్‌లను నియమించుకోవాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఏఎస్‌ఐ శివారెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు దాతల సహకారం అవసరం


విద్యార్థులకు డ్రెస్‌లు పంపిణీ చేస్తున్న దాత, ఉపాధ్యాయులు

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలని షాబాద్ ఇన్‌చార్జి ఎంఈఓ శంకర్‌రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో అదే గ్రామానికి చెందిన కడుమూరు సత్యం విద్యార్థులకు 30 జతల స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. తాను సంపాదించిన దాంట్లో కొంత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఖర్చు చేస్తానని చెప్పారు. గురువులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో తాళ్లపల్లి హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగిరెడ్డి, కృష్ణ, గ్రామస్తులు భాస్కర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

హిందూముస్లింలు ఐక్యంగా ఉండాలి


నూతన మసీద్‌లో సన్మానం అందుకున్న నాయకులు

షాబాద్: హిందూముస్లింలు సోదర భావంతో ఐక్యతను చాటుకోవాలని కాంగ్రెస్ పార్టీ షాబాద్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ముద్దెంగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన జుమ్మా మసీద్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ కలిసి దేవాలయాలు, మసీదులోకి వెళ్లి పూజలు, ప్రార్థనలు చేసుకోవాలన్నారు. హిందూముస్లిం భాయ్ భాయ్ అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సుదర్శన్, రవీందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ చెన్నయ్య, నాయకులు ఖాజామియాపటేల్, అశ్వక్‌అలీ, జానీ, అబ్బాస్, అక్బర్, నాయకులు సంజీవరెడ్డి, కిషోర్‌నాయక్, ప్రభాకర్‌రెడ్డి, పాపిరెడ్డి, పర్వేద నర్సింహులు, గ్రామస్తులు తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో యువత ముఖ్య భూమిక

పార్టీ యూత్ విభాగం చేవెళ్ల అధ్యక్షుడు పెంటారెడ్డి


జెండా ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ యువజన నాయకులు

చేవెళ్ల: యువజన కాంగ్రెస్ అనేది పార్టీలోకి వచ్చే యువతకు రాజకీయ విలువలు, నాయకత్వ లక్షణాలను నేర్పిస్తోందని ఆ పార్టీ యువజన విభాగం చేవెళ్ల అధ్యక్షుడు జి.పెంటారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాలను ఆ విభాగం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశానికి పెద్దపెద్ద నాయకులను అందించిన ఘనత యువజన కాంగ్రెస్‌దేనని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావటానికి యూత్ కాంగ్రెస్ ముఖ్య భూమిక పోషించిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు ఆగిరెడ్డి, కృష్ణారెడ్డి, శైలజ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ నియంత్రణకు కృషి

సీఐ భూపాల్ శ్రీధర్


అవగాహన కార్యక్రమంలో పోలీసులు

చేవెళ్ల: రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని ఊరేళ్ల సమీపంలో ఉన్న సాగర్ గ్రూప్ ఆఫ్ ఇన్సిట్యూషన్‌లో శుక్రవారం చేవెళ్ల పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 'డ్రగ్స్‌కు నో' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను గురించి వివరించారు. విద్యార్థులు డ్రగ్స్ జోలికి పోవద్దని హెచ్చరించారు. మత్తు పదార్థాలు వంటివి కళాశాలలో ఎవరైనా ఉపయోగించినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ప్రదీప్ కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

నాగుల పంచమి వేడుకను పురస్కరించుకొని చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో మహిళలు పెద్దఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయమే సమీప ఆలయాలకు చేరుకొని ప్రత్యేకతను చాటుకున్నారు. అనంతరం పుట్టల వద్ద పాముకు పాలు పోసేందుకు పోటీ పడ్డారు.


షాద్‌నగర్: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్


మొయినాబాద్: పుట్టలో పాలు పోసి పూజలు చేస్తున్న మహిళలు


షాద్‌నగర్‌రూరల్: ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు


శంకర్‌పల్లి: బుల్కాపూర్‌లో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి


మొయినాబాద్‌రూరల్:అమ్డాపూర్ రక్షమైసమ్మ దేవాలయ సమీపంలో మహిళల సందడి

పరిసరాల శుభ్రతకు కలిసికట్టుగా

ఆయా చోట్ల మొక్కలు నాటిన నాయకులు, అధికారులు


మొయినాబాద్‌రూరల్: మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య


కొత్తూరు: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే శంకర్ నాయకులు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో శుక్రవారం కొనసాగింది. నాయకులు, అధికారుల సమన్వయంతో ఆయా చోట్ల మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు అవగాహన కల్పించారు.

మొయినాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి ముఖ్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని పేర్కొన్నారు. అడవులు రోజు రోజుకు తగ్గిపోతున్నాయన్నారు. భావితరాల కోసం మొక్కలు నాటాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంధ్య, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

కొత్తూరు: పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించి జీవన ప్రమాణాలు మెరుగు పర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా పట్టణ సమీపంలో మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు.


చేవెళ్ల: ఊరేళ్లలో వనమహోత్సవంలో నాయకులు, ఉపాధి సిబ్బంది


షాబాద్: పోతుగల్‌లో వన మహోత్సవంలో భీంభరత్ తదితరులు

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


లబ్ధిదారురాలికి కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొందుర్గు: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుక్రవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం వనంపల్లి, కొందుర్గులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం, వాతావరణ కాలుష్యం ఏర్పడి జీవరాశి మనుగడ కష్ట సాధ్యంగా మారిందన్నారు. మొక్కలు నాటి సంరక్షిస్తే పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమంతోపాటు రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రమేష్ కుమార్, జగదీశ్వర్, ఎంపీడీఓలు లక్ష్మి అనురాధ, ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజు, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నేత


కేంద్ర మంత్రితో శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హరిదీప్‌సింగ్‌పురిని శుక్రవారం షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి కలిశారు. ఈ మేరకు ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయానికి వెళ్లిన ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు

షాబాద్: విద్యుత్ తీగలు తెగిపడడంతో 30 వ్యవసాయ మోటార్లకు నాలుగు రోజులుగా కరెంటు సరఫరా నిలిచిపోయింది. మండలంలోని పోతుగల్ గ్రామ శివారులో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో రైతులు, కూలీలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పంటలు ఎండిపోతున్నాయని విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని రైతులు వాపోయారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ తీగలను సవరించాలని కోరుతున్నారు.


పొలాల్లో పడిన విద్యుత్ వైరును పరిశీలిస్తున్న రైతు

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు

వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల నుంచి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ సూచించారు. ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ, వ్యకాసం సంయుక్త ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విదేశీ గుప్త కంపెనీలకు ఎర్రతివాచీలు పరిచి స్వాగతం పలుకుతున్నారని విమర్శించారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చట్టాలను మార్చేందుకు కుట్రలు పన్నుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా మైనార్టీలపై మూక దాడులకు దిగడంతోపాటు ఆర్‌ఎస్‌ఎస్, హిందుత్వ మతశక్తులు విద్వేషాలను పెంచుతున్నాయన్నారు. సామాన్యులకు మాటలు, సంపన్నులు, కార్పొరేట్ సంస్థలకు మూటలు వడ్డించే విధంగా కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని విమర్శించారు. అత్యంత కీలకమైన వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, పద్మారెడ్డి, లలిత, శ్రీనివాస్, రాజశేఖర్, రాజు, కుర్మయ్య, ఎండి.బాబు, జంగయ్య,జంగమ్మ, లక్ష్మమ్మ, చెన్నమ్మ, నర్సమ్మ, పద్మమ్మ, రాజు, సుక్కమ్మ, నర్సింలు పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేస్తే గుర్తింపు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్‌రూరల్: విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులకు తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ శంకర్‌రాథోడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీపై వచ్చిన, వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంఈఓ శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో బదిలీలు సర్వసాధారణమని అన్నారు. ఉద్యోగులు ఎక్కడ పని చేసినా తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సన్మానం పొందిన వారిలో గీత, వందన, బుగ్గమ్మ, గీతమ్మ, కృష్ణమ్మ, మాలతీ, స్వప్న, రేణుక, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిప్రసాద్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ చంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ సునీత రాజు, నాయకులు సంజీవయాదవ్, మధుకర్‌గౌడ్, శ్రీశైలం, బుడ్డనర్సింలు, ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి, ఉపాధ్యాయురాలు అరుణ, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీలు సహజం

చేవెళ్ల: ఉద్యోగులకు బదిలీలు సహజమని మండలంలోని ఎన్కేపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునీర్‌పాషా అన్నారు. స్థానిక పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు సుధాకర్, కృష్ణలు బదిలీ, పదోన్నతిలపై పాఠశాల నుంచి వెళ్లటంతో వారికి శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటయ్య, ఉషశ్రీ, అశ్విని,కమల, దయానందం, మాజీ సర్పంచ్ రాధా, నాయకులు సుధాకర్‌రెడ్డి ఉన్నారు.